

సన్మానం అందుకున్న వారితో కమాండెంట్ సి.సన్ని

ఉద్యోగ విరమణ సన్మానం

గచ్చిబౌలి, మే 31 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్న వారిని బెటాలియన్ కమాండెంట్ సి.సన్ని శుక్రవారం ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో మోహన్‌రాం, ప్రభాకర్, సత్యనారాయణ ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టీవీ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, నాగభూషణం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు..

ఫతేనగర్: ఉద్యోగ విరమణ వయస్సుకే తప్పా.. మనసుకు కాదని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం ఇసాక్ అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందుతున్న డిపో సూపరింటెండెంట్ ఏ.శంకరయ్య, ఏడీసీలు ఏవీ గౌడ్, రామిరెడ్డి, కండక్టర్లు పవన్‌కుమార్, చార్లెస్ పాల్ కోసం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా హాజరై సన్మానించారు. అనంతరం డీఎం మాట్లాడారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మజ్దూర్ సంఘ్ నాయకులు, మల్లారెడ్డి, ఐలయ్య, మురళీ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు వెంకటేశ్‌గౌడ్, డిపో కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు పోలీసు ఉపకమిషనర్ జయరాం, సభ్యులు

ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన అవగాహన పోస్టర్‌ను అదనపు పోలీసు ఉప కమిషనర్ ఎస్ జయరాం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన ఎదురయ్యే అనర్థాలను వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, జనార్దన్, శ్రీను, ధర్మసాగర్, జీవీరావు, బాలన్న, విశ్వశాంతి, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల ఉక్కు పాదం

నిజాంపేట్, మే 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం కూల్చివేశారు. నిజాంపేట్ గ్రామం, ప్రభుత్వ సర్వేనెంబరు 334లో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కబ్జాదారులు 60 గజాల చొప్పున ప్లాట్లును చేశారు. ఒక్కొక్క ప్లాట్‌కు రూ.15 లక్షల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు మేడ్చల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చెయ్యడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను చేపట్టొద్దన్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

- పొంచిఉన్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

పేట్‌బషీరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్, జీడిమెట్ల డివిజన్‌ల్లో ప్రధాన రోడ్ల పక్కనే రక్షణగోడ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా దర్శనం ఇస్తున్నాయి. విద్యుత్ తీగలు మనిషికి అందేంత ఎత్తులో ఉండడంతో మూగజీవులు, చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రక్షణ గోడలు లేని ట్రాన్స్ ఫార్మర వద్ద ఎన్నో ప్రమాదాలు జరిగినా అధికారులకు కనువిప్పు కలుగడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ విద్యుత్ వైర్లు నేలకు ఆనుకొని ఉండడంతో, వాటి చుట్టూ పిచ్చి మొక్కలు మొలవడం, స్థానికులు చెత్తా, చెదారం వేయడంతో ఏ విద్యుత్ వైర్లు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని స్థానికులు మండి పడుతున్నారు. మంగళవారం సుభాష్‌నగర్ చివరి బస్టాప్ సమీపంలోని స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్న చిన్నారి విద్యుదాఘాతానికి గురైన విషయం తెలిసిందే. ఇలా బయటకు రాని ఘటనలు మరెన్నో ఉన్నాయి. గతంలో వర్షం వచ్చినప్పుడు మూగజీవులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు మేతకు వెళ్లి షాక్‌కు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ వైర్లకు చెట్టు కొమ్మలు తగులుతున్నాయని కొట్టి వేస్తున్న అధికారులకు, కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాలనీ అంతర్గత రోడ్లలో ఉన్న టాన్స్‌ఫార్మల పరిస్థితి ఏమిటని స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాల పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



రంగారెడ్డినగర్ ప్రధాన రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకు పోయిన చెట్ల కొమ్మలు



చేతికి అందేంత ఎత్తులో విద్యుత్ వైర్లు



జీడిమెట్ల పోస్టాఫీస్ వద్ద..

ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై హెచ్‌సీయూలో సదస్సు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్న అసమానతల కారణంగా వెనుకబడిన వర్గాల వారు టెక్నాలజీ ఫలితాలను అందిపుచ్చుకోలేకపోతున్నారని న్యూఢిల్లీ యునెస్కో కల్చరల్ చీఫ్ జుహ్నీహాన్ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌లో నిర్వహించిన 'సస్టైనింగ్ కల్చరల్ డైవర్సిటీ ఇన్ ద కాంటెక్స్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ఇన్ ఇండియా' పేరుతో రెండు రోజుల సదస్సును వీసీ ప్రొఫెసర్ బీజేరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు ఎమర్జింగ్ టెక్నాలజీ, టెక్ ఇండస్ట్రీ, డిజైన్ ప్రిన్సిపల్స్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసర్ జె ప్రభాకర్ రావు, సీసీఆర్‌టీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాహుల్‌కుమార్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ ప్రమోద్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

కొమిరిశెట్టి మాణిక్‌రావు వర్ధంతి

రాయదుర్గం, మే 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల మాజీఅధ్యక్షుడు, ఆల్విన్‌కాలనీ రిటైర్డ్ సెక్రటరీ కొమిరిశెట్టి మాణిక్‌రావు ద్వితీయ వర్ధంతిని శుక్రవారం ఖాజాగూడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి తన బాబాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఆచార్య దార్లకు సన్మానం

రాయదుర్గం, మే 31 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కాలంలో తెలుగు శాఖాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి తెలుగుశాఖ అధ్యక్షుడిగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు చేసిన సేవలు అభినందనీయమని పలువురు అధ్యాపకులు కొనియాడారు. హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడిగా శుక్రవారం తన ఉద్యోగ కాలం పూర్తైన సందర్భంగా అధ్యాపకులు అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఘనంగా సన్మానించారు. తెలుగు శాఖ అధ్యక్షుడిగా తన విధులను నిర్వహిస్తునే మరోవైపు పాఠాలు చెబుతూ, పరిశోధనలు చేయిస్తూ, వ్యక్తిగతంగా తాను రచనా వ్యాసంగాన్ని, సాహిత్య కార్యక్రమాన్ని కొనసాగించారని తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య వంగరి త్రివేణి, డాక్టర్ బి.తిరుపతి, డాక్టర్ బి.భుజంగరెడ్డి, డాక్టర్ పి.విజయ్‌కుమార్, బి.లత, స్వాతి, దయాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆచార్య దార్లను సన్మానిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

20 బైక్‌లు స్వాధీనం

పేట్‌బషీరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను దొంగిలించి విక్రయిస్తున్న ముగ్గురిని పేట్‌బషీరాబాద్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకొని వారి నుంచి 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్ డీఐ నర్సింహరాజులు కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. కామారెడ్డి జిల్లా, మాచారెడ్డి గ్రామానికి చెందిన బక్కొళ్ల నవీన్‌గౌడ్(34), బతుకుదెరువు కోసం వలస వచ్చి ఉప్పల్ చిలుకానగర్‌లో ఉంటూ ఆటో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం, ఇసైపేట్‌కు చెందిన పల్లికొండ దేవరాజ్(32),పెయింటింగ్ పని చేస్తుంటాడు. కామారెడ్డి జిల్లా, లింగాపురం గ్రామానికి చెందిన ఎనుగుర్తి ప్రశాంత్(19) విద్యార్థి నవీన్‌గౌడ్ దగ్గర ఉంటూ ఆటో గ్యారేజీలో పని చేస్తున్నాడు. వీరంతా ఈజీమనీ కోసం దొంగతనాలను ఎంచుకున్నారు. నిర్మానుష ప్రాంతంలో, వసతి గృహాల వద్ద పార్కు చేసిన వాహనాలను దొంగిలిస్తుంటారు. అయితే ఆ బైక్‌లను మెకానిక్ నవీన్‌గౌడ్ ద్వారా కామారెడ్డి జిల్లా పరిసర గ్రామాల్లో విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో మరో దొంగతనానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకొని విచారించగా నేరాలను అంగీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.



…మాట్లాడుతున్న ఏసీపీ రాములు

గాలికొదిలేసిన స్వచ్ఛ టాయిలెట్స్ నిర్వహణ

పేట్‌బషీరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ హైదారాబాద్‌లో భాగంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. బహిరంగంగా మల, మూత్రవిసర్జ నిర్మూలించే దిశగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు డివిజన్‌లోని ప్రధాన రహదారులు, కూడల్లు, కార్యాలయాల సమీపంలో లక్షల నిధులు వెచ్చించి టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. కానీ ఆరంభంలో చూపిన శ్రద్ధ నిర్వహణలో చూపడం లేదని పలువరు ఆరోపిస్తున్నారు. టాయిలెట్లు నిర్వహన కాంట్రాక్ట్ దక్కించుకున్న ప్రైవేట్ ఏజన్సీలు టాయిలెట్స్‌ను శుభ్రం చెయ్యకపోగా, వాటర్ ట్యాంకుల్లో నీళ్లు నింపడం లేదు. దీంతో చాలా టాయిలెట్స్ దుర్గంధంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో టాయిలెట్స్‌లో నీళ్లు లేక దుర్గంధబరితంగా ఉన్నాయి. టాయిలెట్స్ నిర్వహన లేక నిరుపయోగంగా ఉన్నాయి.



వెన్నెల గడ్డ చెరువు వద్ద నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్

ఐఐఐటీహెచ్‌లో సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్‌పై సదస్సు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఈఆరసీ) ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్ 21వ సదస్సుకు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ హెచ్) వేదిక కానుంది. ఈ సదస్సు 16 ఏళ్ల తర్వాత ఐఐఐటీహెచ్ క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. ఐఐఐటీహెచ్‌లో జూన్ 4 నుంచి 8 వరకు నిర్వహించే ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు, యూఎస్, స్వీడన్, జర్మనీ ఇలా 150 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో వర్క్‌షాపులు, ట్యుటోరియల్ సెషన్స్ ఇండస్ట్రీ కేస్ స్టడీస్, ప్రెజెంటేషన్‌లు, ప్యానల్ సెషన్, ఎడ్జ్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ, సస్టైనబుల్ ఆర్కిటెక్, క్వాలిటీ ఆఫ్ సర్వీస్, మోడలింగ్, సాంకేతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్ రంగంలోని పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు విజ్ఞానం, అనుభవాలు, నూతన టెక్నాలజీని అర్థం చేసుకొని ఈ రంగాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇది చక్కని అవకాశమని ఎస్ఈఆరసీ ఐఐఐటీహెచ్ డాక్టర్ వై రఘు రెడ్డి తెలిపారు.

డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరిని అమీర్‌పేట ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 11 గ్రాముల ఎండీఏ, ద్విచక్ర వాహనం, సెల్‌పోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-5లో డ్రగ్స్ విక్రయిస్తున్నారని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు అందడంతో దాడులు నిర్వహించి షాబాజ్‌ఖాన్, మహ్మద్ ఆదిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 11 గ్రాముల ఎండీఏ ఉంది. దీంతో వీరిద్దరిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు రియాజ్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపారు.



ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

ఎటూ తేలని కేకేబీ వసూళ్ల వ్యవహారం

- చర్చలు, సమావేశాలే తప్పా.. తేలని లెక్కలు
- వసూళ్ల వ్యవహారంపై అధికారుల ఆరా..?

బాలానగర్, మే 31(ఆంధ్రజ్యోతి): బాలానగర్ మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యుల మధ్య ఇంకా చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. బాలానగర్‌కు చెందిన చిన్న పరిశ్రమలకు ప్రభుత్వ స్థలాల కేటాయింపు విషయమై అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి సునీల్‌కుమార్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యుల మధ్య తలెత్తిని వివాదంపై ఇంకా నీలినీడలు వీడనట్లు తెలుస్తోంది. బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌ను కాదని అధ్యక్షుడు సునీల్ కేకేబీ సంస్థను తెరపైకి తెచ్చి దాని పేరు మీద సుమారు 150కి పైగా పారిశ్రామికలవేత్తల నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసి వారికే స్థలాలు ఇస్తానని అధ్యక్షుడు చెప్పడంతో అసలు వివాదం మొదలైంది. చిలికిచిలికి గాలి వానగా మారిన ఈ వివాదంతో అసోసియేషన్ సభ్యులంతా మూడు వర్గాలుగా విడిపోయినట్లుగా సభ్యుల తీరును బట్టి తెలుస్తోంది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సలహా సూచనల మేరకు వారం రోజుల క్రితం వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాంతాల వారీగా ముఖ్య సభ్యులంతా సమావేశమై 11 మందితో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ కమిటీ ద్వారా అధ్యక్షుడు సునీల్ ఏకపక్ష ధోరణి, కేకేబీ సంస్థ పేరు మీద జరిగిన అవకతవకలు, అక్రమ వసూళ్ల విషయంపై చర్చిస్తున్నారు.

మున్నా గ్యాంగ్ అరెస్ట్

జీడిమెట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై దాడి చేసి సెల్‌ఫోన్‌లు నగదు దోచుకుని, క్యాబ్‌డ్రైవర్‌ను బ్లేడ్‌లతో మెడపై కోసి హత్యాయత్నానికి పాల్పడిన మున్నాగ్యాంగ్‌ను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ హన్మంతరావు తెలిపిన వివరాల ప్రకారం... గుండ్లపోచంపల్లి గ్రామానికి చెందిన కొండా స్వామి, గాజులరామారం నెహ్రూనగర్‌కు చెందిన అమూల్యలు నానక్‌రాంగూడలోని ఫస్ట్‌సోర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. రోజూ వీరిని క్యాబ్ డ్రైవర్ అనిల్‌కుమార్ ఇంటివద్ద దింపివెళ్తుంటారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో నెహ్రూనగర్‌కు వీరు ప్రయాణిస్తున్న కారు రాగానే, సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన కరుడు కట్టిన నేరస్తుడు మహ్మద్ మజీద్ అలియాస్ మున్నా(24), అన్నారం అఖిల్ (24), నెహ్రూనగర్ లంబాడ బస్తీకి చెందిన టీ.రాజాసింగ్ (30), రొడామిస్త్రీనగర్‌కు చెందిన డి.కార్తీక్ (19), సిహెచ్.చందు (22), మగ్దల్ చింటూ (21)లు అడ్డుకున్నారు. మున్నా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల దగ్గర సెల్‌ఫోన్‌లు, డబ్బులు గుంజుకున్నాడు.అడ్డువచ్చిన కారు డ్రైవర్ అనిల్‌కుమార్‌ను బ్లైడ్‌తో మెడపై తీవ్ర గాయం చేశాడు.అక్కడి నుంచి వెళ్లి పోవాలని వారిని బెదిరించాడు. ఆతర్వాత వారు బైక్‌లపై బాలానగర్ వైపు వెళ్తు బాలానగర్ చౌరస్తాలో ఓ జంటను బెదరించి కొట్టి వారి బైక్‌ను గుంజుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జీడిమెట్ల పోలీసులు శుక్రవారం హెచ్ఎంటీ జంగల్‌లో తిరుగుతున్న ఆరుగురు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద ఫోన్‌లు, బైక్, స్వాధీనం చేస్తున్నారు. రిమాండ్‌కు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన వీర వర్ధన్‌రెడ్డి (33) కుటుంబంతో కలిసి బాచుపల్లి కౌసల్య కాలనీలో ఎస్ఎస్‌కే అపార్ట్‌మెంట్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, 6 నెలల కుమారుడు ఉన్నారు. భార్య డెలివరీ కోసం స్వస్థలం శ్రీకాకుళం వెళ్లింది. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వీరవర్ధన్‌రెడ్డి ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఈనెల 30న ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు.

● పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో..

బేగంపేట నుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చే వాహనాలను సీటీఓ, తివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను పాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్పీ రోడ్ వైపునుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చే వాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు. ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్‌రోడ్స్, ప్లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని విజ్ఞప్తి

● ట్యాంక్ బండ్ పరిసరాల్లో..

అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపునకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపునుంచి వచ్చే వాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపునకు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు.

● గన్‌పార్క్ పరిసరాల్లో..

సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపుతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది.